# దోషి

శ్రీ యలమర్తి రామమోహనరావు

వెంకటేశ్వర్లుగారు ఆ ఊళ్లోకల్లా చాలా గొప్పవాళ్లు, వ్యాపారస్తులూ కూడాను. దీనితోపాటు ఆయన సౌందర్యవంతుడు, నవనాగరికుడు కూడాను.

అది మంచి మండు వేసవికాలము. ఎర్రని నిప్పు కణాల కురుస్తూన్నాయి. ఎండ భయంచేత ఎవ్వరూ బయటికి రావడానికే సహించలేక పోతున్నారు. సుమారు 12 గంటలవుతుంది. వెంకటేశ్వర్లుగారు భోజనంచేసి, మేడమీద సోఫాలో ఒక్క నిమిషం ఇట్టే చతికిలబడ్డారు. నౌకరు "టీకి" మనిపించేడు అంతలోనే ఆయన కూర్చున్న సోఫాపై నిర్మింపబడివున్న ఎలక్ట్రిక్ ఫేను గిర్రున తిరగడం ప్రారంభించింది. ఆగాలి విసరునకు దగ్గరేవున్న బల్లపై కాగితాలు ఎగిరి గదిలో కొంచెం ధ్వనిచేసాయి. ఆధ్వనిలోనే మరొక ధ్వని కూడా మిలితమయింది. ఆధ్వని కొంచెం శ్రద్ధగా వినేసరికి ఎవరో మేడమెట్లు ఎక్కుతూన్నట్లు ఊహించేరు. ఎవరాఅని అనుకునేటప్పటికి అంతవరకెన్నడూ ముఖమైనా ఎరగని ఒక నూతన వ్యక్తి లోనికివచ్చి గుడ్‌మార్నింగు అన్నాడు. వెంకటేశ్వర్లుగారు కూడా ఆయనకు గుడ్‌మార్నింగ్ అని అక్కడేవున్న ఒక ఫేము కుర్చీమీద కూర్చోండి అనే అర్థం వచ్చేటట్టు ఆ నూతనవ్యక్తికి ఒక సంజ్ఞ చేసాడు.

ఆవ్యక్తి 30 యేండ్ల యువకుడు మరీ సన్నంగాదు. మరీ లావుకాడు. ఇంక ఛాయ ఛామనఛాయ బాగా టోయిలెట్ అయేడు. సూటు,బూటు,హేటు ఉంది. ముందరికి పడిపోతూన్న తన పెద్ద నల్లని క్రాపింగు సవరించుకుంటూ ఫేము కుర్చీలో కూర్చొని యిలా చెప్పేడు "నేను ఇదివరకెప్పుడూ మీ దర్శనం చేయలేదు, మీదర్శనంచేసి కొంచెం రహస్యం మాట్లాడాలని వచ్చేను. వెంకటేశ్వర్లుగారు "సరే బాగానే ఉంది. మీరువచ్చిన పనేమిటి చెప్పండి" అని అంటూ ఒక సిగరెట్టు ఆఫరుచేసి తానోటి అంటించాడు షోగ్గానూ. ఆ నూతనవ్యక్తికూడా అగ్నిహోత్రంచేస్తూ, కొంచెంగా తల పంకిస్తూ ప్రారంభించాడు ఉపన్యాసం "ఈవేళ తారిఖు 15-4-40 కాదండీ. వెంకటేశ్వర్లుగారు" అవును అన్నారు (మళ్లీ ఆనూతనవ్యక్తి ప్రారంభించాడు) నిరుడుకాక అంతక్రితం సంవత్సరం ఈ తేదీని మీ కంపెనీలో ఒక పెద్దచోరీ జరిగిన సంగతి మీకు జ్ఞాపకమేమైన ఉందా?

రెండేండ్లమాటి ఇప్పుడెందుకు?

ఆ రెండేండ్లనాటి విషయం గురించే నేను వచ్చింది.

వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపోతూ, అయితే ఇప్పుడా విషయం ఎందుకో నాకు తెలియడంలేదు, పోలీసులు సహితం నాటినుండి నేటివరకూ ఆచోకీ తీయలేని ఆవిషయం గురించి మీకేమైనా తెలుసా?

లేదు దాని జాడ యేమీలేదు. పూర్తిగామాయమైపోయాడు కాని ఒక్క సంగతి ఆవిషయంలో నాకు కొంచెం తెలుసునంటే మీకు ఆశ్చర్యం వేస్తుంది. మీరు నమ్మరు, కాని మీరు ఎంత జాగ్రత్తగానున్నా మంచి ధైర్యసాహసాలతో ఆ దొంగతనం చేసినది నేనే.

ఈమాట వింటూనే వెంకటేశ్వర్లుగారు చటాలున సోఫాలోంచి లేచి, సిగరెట్టు క్రిందపారేసి దాన్ని కాలిలో నలిపేస్తూ (నిన్ను ఆలాగే చేస్తాను) సుమా అని ఆవ్యక్తికి అర్థం అయేటట్టు ఆ! నువ్వేనా ఆపని చేసింది. ఉండు నీపని పట్టా. పోలీసుల కొప్పచెప్తాను. చూచుకో అని గుడ్లెర్రచేసేడు. ఆవ్యక్తి ఆయన చేయి పట్టుకొని నేను చెప్పేదంతా పూర్తిగావిని తర్వాత: అన్నాడు. అయితే ఆసొమ్ము నీవు ఏంచేశావన్నారు వెంకటేశ్వర్లుగారు.

ఆసొమ్ములు అమ్మి Cash చేసుకుని రంగూను పారిపోయి రహస్యంగా వున్నాను. ఆలా ఉంటూ వుండగా నాకు అదృష్టపు రోజులు వచ్చినవి కాబోలు ఒకనాటి మధ్యాహ్నము నిద్రనుండి లేచి సర్కితలుపు వద్ద ఒక్క వుత్తరం పడివుంది. అప్పుడే పోస్టుమేన్ పడవేసి ఉంటాడు అని ఊహించి తీసి చదివేను కాని నా కళ్లను నేను నమ్మలేకపోతిని. అది నాస్నేహితునిదగ్గర నుండి చదువుతూ, చదువుతూ కళ్లనుండి నీటిధార ప్రవహించింది. ఇంతలో ఇంక రెండుపంక్తులు చదివేసరికి ఆకన్నీటిధార ఆనందబాష్పధారగామారింది.విష

యమేమిటంటె నా బంధువుడొకడు చనిపోయేడు. ఆస్తి సుమారు, 10 లక్షలు, వారసులులేరు. నేనే వారసుణి అవుతాను అని వ్రాసాడు. సరీ అని మర్నాడే బయలుదేరి మా గ్రామంచేరి ఆ ఆస్తినంతటిని స్వాధీనం చేసుకున్నాను. అప్పుడు నాసంతోషానికి హద్దు కూడాలేదు. నా హృదయాన్ని నేను వెలిబుచ్చలేకపోయాను.

ఎంత డబ్బున్నప్పటికీ నాకు యేమీ సంతోషముగా వుండేదికాదు. రాత్రులందు నిద్రపట్టేదికాదు. ఎప్పుడూ నన్ను ఎవరో తరుముతూన్నట్టుగా వుండేది. దీనంతటికి కారణము, ఆనాడు నేనుచేసిన దొంగతనమే అని నాకు బాగా బోధపడింది. అదే నా జీవితంలో ఒక పెద్దమచ్చ ఆమచ్చ పోతేనేకాని నాకు సౌకర్యం వుండదని అర్థమయింది. ఎప్పుడో ఒకనాడు నేచేసిన నేరం వెల్లడికాకమానదు. నన్ను జయిలులో పెట్టకమానరు. ఆజయిలు సంగతులు తలపెట్టితేనే ఒళ్లుపులకరిస్తోంది. ఆవిషయము తలపెట్టితే నాకు అతి భయం వేస్తూంది. చివరికి రెండురోజుల క్రితమే నేనొకటి నిశ్చయించుకున్నాను.


ఉచితము! ఉచితము!! ఉచితము!!!

ఫాన్సీ

చేతి గడియారములు

మోడల్ 1940

6 పాట్లు

ఆటోమేటిక్

రివాల్వరు

లైసెన్సు లేదు




దీనియొక్క ఆకారము యీ పైచిత్రంలో ఇవ్వబడింది. నిజమైన రివాల్వరులాగ ఆకారాన్ని కలిగి పెద్ద ధ్వనికూడా ఇస్తుంది. 15 ఔన్సులు బరువు, 7 అంగుళాలు పొడుగు. దీని మాగజైనులో 6 పాట్లు ఇమిడి ఒకటివెంబడి ఒకటిగా చాలా చురుగ్గా కాల్చడానికి వీలుంటుంది. అడవిమృగాలను, దొంగలను, విరోధులను తరిమివేసేటంత పెద్ద ధ్వనిగలిగిన యీ రివాల్వరుకు లైసెన్సుకూడా లేదు. వెల నెం. 777 రు. 4-8-0 35 తూటాలతో. నెం. 888 మంచిరకము, గట్టి ఇనుముతో తయారుకాబడినది రు. 5-13-0 45 తూటాలతో. 1000 పై తూటాలు రు. 3-0-0. బెల్టు, పెట్టె రు. 1-12-0. రివాల్వరుకు ఆయిల్ రు. 0- 2-0 తపాలాఖర్చులు ప్రత్యేకము. ప్రతి రివాల్వరుతోను రెండు ఫాన్సీ రిస్టువాచీలు ఉచితముగా ఇవ్వబడును. 3 రివాల్వర్లను ఒకేసారి కొనేవారికి 6 ఫాన్సీ రిస్టువాచీలు, తపాలా ఖర్చులుకూడా ఉచితము

**AMERICAN PISTOL CO.,** Post Box No. 27, (K. M. 100) AMRITSAR. (India)

వెంకటేశ్వర్లుగారూ! నేనుచేసిన దొంగతనము వల్ల మీకు కలిగిన నష్టము యావత్తు ముందర ఇచ్చివేసి, నా హృదయానికి శాంతి చేకూర్చుకోవాలి. నా జీవితమెప్పటికయినా ఆ జయిలునందు అంతమవలసినదే అన్న భయము వదలి, నిశ్చింతగా సౌఖ్యమయిన జీవితము గడపనిశ్చయించాను.

అయ్యో వెంటనే చెప్పండి. మీకు ఎంతనష్టము వచ్చిందీ యావత్తూ యిచ్చేస్తా యిప్పుడే సంతోష పూర్వకంగా.

ఈ ముక్కలు వినేటప్పటికి వెంకటేశ్వర్లుగారికి ఎక్కడలేని ఆనందమువచ్చేసింది. అయ్యో నాకువచ్చిన నష్టమెంతో చెప్పడం అంత సులభమైన విషయంకాదు. మీకు నష్టమెంతో చెప్పేముందు నాపుస్తకాలోసారి చూడాలి—చూస్తారూ. అందులోకెంత నష్టము భీమా కంపెనీవల్ల ముదరాకూడా వచ్చింది.

ఆ కంపెనీ కేమిట్లో చెప్పండి వారు మీకు ముదరా యిచ్చిన సొమ్ము వారికిచ్చేస్తాము. ఎందుచేతనంటారా వారు మీకు ఇచ్చిన ప్రతి పైసాకూడా వారికి తిరిగి యివ్వడమునేది నా విధి.

ఒక నిమిషం అంతా నిశ్శబ్దము. గోడనున్న గడియారము మాత్రం తనపనిచేస్తో టికి, టికి యంటోంది. ఓ నిమిషం తీక్షణంగా ఆలోచించారు?

మీది చాలా కొనియాడతగ్గ ఉద్దేశం. మీరు భీమాకంపెనీ ముదరా యివ్వవలసినంత అగత్యమేమీ కనబడదు. ఇంతకు మీ దొంగతనమువల్ల నష్టపడినవాణ్ణి నేనొక్కడనే కాబట్టి మీరు నానష్టం యిస్తే అదే చాలు. మీరు చాల బుద్ధిమంతులు అని తలుస్తాను. ఈ విధమైన నిర్ణయం మన యిద్దరినికూడా తృప్తిపరుస్తుందని తలుస్తాను. నేను చెప్పినట్లుగా కానిచేస్తే నాయందు మీరు ప్రత్యేకాభిమానము చూపినట్లు ఉంది.

కొంత నిమిషం వెంకటేశ్వర్లుగారి వంక ఆశ్చర్యముతో చూచి తలవూపుతూ అదేనా మీరుకోరేవి, అన్నాడు.

అది యెంత పెద్దదొంగతనమో తెలుసుకోగానే నాగుండె బ్రద్దలైపోయింది. ఆసమయాన్ని నా పుస్తకాలు అజాగ్రత్తగా నున్నవి. అందుచే కొద్దిపొరపాటు లెఖలుకూడా ఇచ్చినట్లు జ్ఞాపకము. భీమా కంపెనీకు, తరువాత తెలిసికోగలిగినాను. కూడికలో కొన్నివేల రూపాయలు పొరపాటు చేసినట్లు, నాకు జ్ఞాపమున్నంతవరకూ ఆనష్టము ఒకలక్షా యిరువదివేల రూపాయలు. కాని పొరపాటున నేను భీమాకంపెనీకి తెలియపర్చింది ఒకలక్షా ఏబదివేలు. ఈపాటికి మీకు అర్థమయ్యే ఉండవచ్చు.

నాకు బాగా అర్థమైందండీ మీరు లెక్కలు పొరపాటు కట్టారు యేదో కొద్దిపాటి పొరపాటు అది కూడికలో అంతే కదండీ అని చిరునవ్వు నవ్వేడు, ఆ కొత్తమనిషి భీమాకంపెనీ తాలూకు లెక్కలుచూపిస్తూ. మీరేలా లెక్కలు చెబుతారండీ భీమా కంపెనీదగ్గఱ నాలుగు లక్షలు ముదరా పుచ్చుకున్నారు కదా.

దీనికి వెంకటేశ్వర్లుగారు వానికేసి ఆశ్చర్యముగా చూచారు. భయపడ్డారు కంగారుగా చూస్తున్నారు. ఆ క్రొత్తమనిషి తన కోటుతీసి, అయ్యో నేను భీమాకంపెనీ తరఫున నియమింపబడ్డ C. I. D. నండి తప్పుడు లెక్కలు చూపినందుకు తమర్ని అరష్టు చేయడానికి ఇదిగోనండీ అంటూ చేతికిచ్చాడు వారంటు.


## SEXUAL LOVING BOOKS

Sexual Beauty of the Female from thoroughly illustrated with 185 Photos, Rs. 4-8-0. Sex Pictorial with Hundreds of Pictures. It contains 21 Chapters and also special secret pictures. Sealed in the end Rs. 4-8-0



*Sex and the Girl of 18* It describes frankly everything pertaining to female sex, Sexual Love etc., with 40 illustrations Rs. 2

*Rati Sastra:* This book contains a number of Sexual secrets and its vivid illustrations Rs. 1-12-0

| | | |
|---|---|---|
| *Sex Orgains in Woman* Illustrated | ,, | 0-12-0 |
| *Hidden Exercises of Enjoyment* Illustrated | ,, | 0-8-0 |
| *Secrets of Sexual Science* Illustrated | ,, | 0-8-0 |
| *Hidden Powers in Man 500 Pages* | ,, | 2-8-0 |
| *Secret of Sexual Bliss* Illustrated | ,, | 1-0-0 |
| *Female Sex Organ* Illustrated | ,, | 0-8-0 |

**T. R. ROYAL & CO.,**

**3, Krishnappa Naick Tank Street, G. T., MADRAS**